వరంగల్
# వాయిస్
www.warangalvoice.net
Evening Daily
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 213 శనివారం | 24 ఫిబ్రవరి 2024 | పేజీలు : 10 | వెల రూ. 5




# వనం లోకి.. వనదేవతలు



- నేటితో ముగిసిన మేడారం జాతర
- గద్దెల వద్ద పూజారుల ప్రత్యేక పూజలు
- సమ్మక్క చిలకలగుట్టకు.. సారలమ్మ కన్నెపల్లి ఆలయానికి..
- జాతరకు తరలివచ్చిన కోటిన్నర మంది భక్తులు
- మేడారం జాతర సక్సెస్

తెలంగాణ కుంభమేళా మేడారం జాతర ముగిసింది. శనివారం గిరిజన పూజారుల ప్రత్యేక పూజల అనంతరం సమ్మక్క, సారలమ్మ అమ్మవార్లతో పాటు పగిడిద్దరాజు, గోవిందరాజు వనప్రవేశం చేశారు. దీంతో నాలుగు రోజుల పాటు అంగరంగ వైభవంగా సాగిన మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర సమాప్తమైంది. గద్దెల వద్ద నుంచి డోలు వాయిద్యాలు, డప్పు చప్పుళ్ల మధ్య సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు వనంలోకి తరలివెళ్లారు. అశేష భక్తజనం ఆ ఘట్టాన్ని తిలకించి పులకించిపోయారు. సమ్మక్క, సారలమ్మ నినాదాలతో అరణ్యం దద్దరిల్లింది. (మిగతా 2లో.. )

# సీన్ రిపీట్ ?



వివరాలు 2లో..

## కాంగ్రెస్ ఢిల్లీ గులాం గిరి వదులుకోకపోతే ఇబ్బందులే



- కేసీఆర్ లాగా భారీ మూల్యం తప్పదు
- సమర్థమైన సీఎంగా రేవంత్ రాణించాలి
- గతానుభవాలే పాఠంగా మారాలి
- తరుచూ ఢిల్లీ యాత్రలు ప్రమాదం
- పోరాటాలతోనే మెరుగైన ఫలితాలు..

ఈ నెల 27న మరో రెండు గ్యారంటీలు అమలు చేస్తున్నామని సీఎం రేవంత్ ప్రకటించారు. రూ.500 లకే గ్యాస్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం అమలు చేయనున్నట్లు వెల్లడించారు. ఇంతవరకు బాగానే ఉన్నా ఈ పథకాన్ని ఏఐసీసీ అగ్రనేత ప్రియాంక గాంధీ చేతుల మీదుగా ప్రారంభిస్తామని తెలిపారు. ప్రభుత్వ పథకాల అమలకైతేనేమి, ప్రతి విషయానికి ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలపై ఆధారపడడం రేంవత్ రెడ్డి ప్రభుత్వానికి ఇబ్బందికరంగా మారే అవకాశాలుగా కనబడుతున్నాయి. తెలంగాణ కాంగ్రెస్ పార్టీ గులాం గిరి అసలుకే ఎసరు తెచ్చే ప్రమాదం ఉంది. పదే పదే హస్తిన యాత్రలు కాంగ్రెస్ కొంపముంచుతాయి. గతానుభవాలే గుణపాఠంగా మార్చుకొని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్ ముందుకు సాగాల్సిన తరుణం ఇదీ. ఈ సత్యాలను ఎంత త్వరగా గుర్తిస్తే సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి అంతమంచిది. ఇలా అన్ని జాగ్రత్తలు తీసుకుని ముందుకు సాగితేనే రేవంత్ రెడ్డి సమర్థమైన సీఎంగా రాణిస్తారు. లేకుంటే సీఎం కేసీఆర్ లాగా భారీ మూల్యం చెల్లించక తప్పదు. - వరంగల్ వాయిస్, ప్రత్యేక పత్రినిధి

10లో



## లోటుపాట్లు స్వీకరిస్తాం

రానున్న జాతరకు సరి చేసుకుంటాం

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క



## నిండు పౌర్ణమి

వెలుగుల విద్యుత్ దీపాల అలంకరణలో మేడారం బస్టాండ్



10లో

## వనదేవతలను దర్శించుకున్న స్పీకర్ గడ్డం ప్రసాద్

సమ్మక్క తల్లి ఎంతో మహిమ గల దేవత

# సీన్ రిపీట్ ?



## కాంగ్రెస్ ఢిల్లీ గులాం గిరి

**వదులుకోకపోతే ఇబ్బందులే**

**లేకుంటే కేసీఆర్ లాగా భారీ మూల్యం తప్పదు**

**సమర్థమైన సీఎంగా రేవంత్ రాణించాలి**

**గతానుభావాలే పాఠంగా మారాలి**

**తరుచూ ఢిల్లీ యాత్రలు ప్రమాదం**

**పోరాటాలతోనే మెరుగైన ఫలితాలు..**

**వరంగల్ వాయిస్, ప్రత్యేక పత్రినిధి :** తెలంగాణలో కాంగ్రెస్ సాధించిన విజయం కేవలం కేసీఆర్‌పై ఉన్న వ్యతిరేకతతోనే అని కాంగ్రెస్ నేతలు ఎంత త్వరగా గుర్తిస్తే అంతమంచిది. అలాగే ప్రజాసంక్షేమంతో పాటు అభివృద్ధి పనులను పరుగులు పెట్టించాలి. నిర్ణయాలు త్వరితంగా తీసుకుంటూనే.. వాటి అమలును కూడా వేగవంతం చేసుకోవాలి. ఈ క్రమంలో కాంగ్రెస్ పెద్దలను అతిగా ఇక్కడ జోక్యం చేసుకోకుండా చూసుకోవాలి. గత వాసనలు వదిలించుకుంటే తప్ప ఇక్కడి రేవంత్ ప్రభుత్వం నిలదిక్కుకోలేదు.

### మూల్యం చెల్లించిన కేసీఆర్

రాష్ట్రంలోని నిరుద్యోగ యువత, కళాకారులు, మేధావులు, జర్నలిస్టులు, సబ్బండ వర్గాలు తెలంగాణ ఏర్పాటుకు పోరాడారు. ఎందరో ఆత్మార్పణం చేశారు.. వారి పోరాటంతో తెలంగాణ సాకారమయ్యింది. అయితే అది తన ప్రతిభ వల్లనే అని, తను చావు వరకు వెళ్లి వచ్చానని పదే పదే చెప్పడంతో పాటు, పదేళ్ల పాటు కేసీఆర్ నిరంకుశంగా పాలించారు. విర్రవీగిన పాపానికి మూల్యం చెల్లించారు. దాని ఫలితమే కరిమింగిన వెలగపండులాగా ఇప్పుడు అప్పుల కుప్పలు బయటపడ్డాయి. నాయకుల అవినీతి బయటపడుతోంది. ఈ విషయాలను గుర్తించి ఇచ్చిన హామీల అమలు కోసం చేసే కార్యక్రమంలో కాంగ్రెస్ పెద్దలను పదేపదే పాల్గొనేలా చేయడం వల్ల ప్రజల్లో విమర్శలపాలు కాకతప్పదు.



### గతానుభవాలను బట్టి నడుచుకోవాలి..

కేవలం ఇక్కడి ప్రజలే తమ హీరోలుగా కార్యక్రమాలతో ముందుకు సాగాల్సి ఉంది. అదే రేవంత్ ప్రభుత్వానికి శ్రీరామరక్ష కానుంది. మల్లికార్జున ఖర్గే మొదలు, రాహుల్, సోనియా, ప్రియాంకలను పార్టీపరంగా ఢల్లీకి వెళ్లి కలవడం వేరు. అదే పనిగా వారే ఇక్కడి కార్యక్రమాలను నిర్దేశించేలా చేసుకోవడం వల్ల ముప్పు ఉంటుందని గుర్తించాలి. గతంలో ప్రతిపనికి ఢల్లీకి వెళ్లిన కారణంగానే కాంగ్రెస్ భ్రష్టుపుట్టి, ప్రాభవం కోల్పోయింది. గతానుభవాలను బట్టి నడుచుకోవాల్సి ఉంది. అందుకే తెలంగాణ పాలనలో వారికి దూరంగా నిర్ణయాలు జరగాలి. వారి ప్రమేయం పెరిగితే మొదటికే మోసం జరుతుంది. ఇప్పటికే కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఢల్లీ నుంచి పాలన అన్న విమర్శలు వస్తున్నాయి. రేపటి సిలిండర్, గృహజ్యోతి పథకాలను కూడా ఇక్కడి సామాన్యులతో ప్రారంభించి ఉంటే మరింతగా రేవంత్ ప్రతిభ పెరిగేది. ఎందుకంటే ఇండియా కూటమిలో లుకలుకలు ఇక్కడ ప్రభావం పడకుండా చూసుకోవాలి. అవకాశం వస్తే మింగేద్దామన్న రీతిలో బీజేపీ, బీఆర్ఎస్ కాచుకుని ఉన్నాయి.

### కాంగ్రెస్‌కు ఇబ్బందికర పరిస్థితులు..

2024 లోక్‌సభ ఎన్నికలలో తాము 400కి పైగా సీట్లు గెలుచుకుని తీరతామని బీజేపీ ప్రకటిస్తోంది. వారసత్వ రాజకీయాలను గట్టిగా వ్యతిరేకిస్తోంది. కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఖర్గే ఉన్నా పెత్తనం సోనియా, రాహుల్‌దేనని తెలిసిందే. ఇప్పటికే కూటమి నుంచి నితీశ్ వైదొలిగారు. నీరసపడిన కాంగ్రెస్ ఇబ్బందికరమైన పరిస్థితులను ఎదుర్కొంటున్నది. యూపీలోని అమేథీని ఇప్పటికే కోల్పోగా, రాయబరేలిలో కూడా విజయం కష్టమే. కాంగ్రెస్ ముక్త రాజకీయాలను మోడీ బలంగా తీసుకుని వెళుతున్నారు. కాంగ్రెస్ రాబోయే సార్వత్రిక ఎన్నికలలో కనీసం 50కి పైగా సీట్లన్కెనా కైవసం చేసుకోగలదా అన్న ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. 2014 లోక్‌సభ ఎన్నికలను తీసుకుంటే.. కేవలం 44 సీట్లు మాత్రమే కాంగ్రెస్‌కు దక్కాయి. కాంగ్రెస్ స్వతంత్ర భారత సార్వత్రిక ఎన్నికల్లో ఇంత తక్కువ సీట్లను మాత్రమే గెలుచుకోవడం అదే మొదటిసారి. 2019 సార్వత్రిక ఎన్నికల్లో కూడాకాంగ్రెస్ పరిస్థితి మెరుగు పడలేదు. 2014లో కంటే కేవలం 8 సీట్లు మాత్రమే అదనంగా గెలుచుకోగలిగింది. కేరళ, తమిళనాడులో అధికార పార్టీలతో పొత్తు పెట్టుకుని పోటీ చేయడం వల్లే 2019లో 52 సీట్లను కాంగ్రెస్ గెలుచుకోగలిగింది.

### పోరాటాలతోనే మెరుగైన ఫలితాలు..

2024 సార్వత్రిక ఎన్నికలలో సైతం కేరళ, బహుశా తెలంగాణ మినహా మరే రాష్ట్రంలోన్కెనా కాంగ్రెస్ గెలుచుకోగల సీట్ల సంఖ్య రెండంకెలలో ఉండటమనేది కష్టమని ఒపీనియన్ పోల్స్ దాదాపుగా అన్నీ ఘోషిస్తున్నాయి. 2014లోనూ, 2019లోనూ కేంద్రంలో బీజేపీ అధికారానికి రావడానికి కాంగ్రెస్ స్వయంకృత రాజకీయాలే కారణం. ఈ నిజాన్ని రాష్ట్ర కాంగ్రెస్ నేతలు త్వరగా గుర్తించాలి. ఇక్కడ కాంగ్రెస్ ముసుగు ఉన్నా ప్రజలు మాత్రం కేవలం కేసీఆర్, బీజేపీ వ్యతిరేకతతో గెలిపించారని తెలుసుకోవాలి. అలా తెలుసుకుని తమ రాజకీయాలన్నీ ఉద్యమ పోరాటాల చుట్టూ సాగించాలి. అప్పుడే తెలంగాణలో మెరుగైన ఫలితాలు వస్తాయి. ఎందుకంటే ఇప్పటికే బీజేపీ, బీబిఆర్ఎస్ వ్యతిరేక ప్రచారాన్ని ముమ్మరం చేసింది. బీఆర్ఎస్ ఒక్కసీటు గెల్చినా దేశానికి లాభం లేదని వాదిస్తోంది. బీఆర్ఎస్‌కు ఓటేస్తే మూసీలో వేసినట్లేనని వాదిస్తోంది. కవితకు సీబీఐ సమన్లు పంపడం ద్వారా బీఆర్ఎస్‌తో ఎలాంటి పొత్తు లేదని చెబుతోంది.

### తెలంగాణలో సెంటిమెంట్‌కు విలువ..

కర్నాటక పరిస్థితులు వేరు. తెలంగాణ ప్రజలు వేరు. తెలంగాణలో ప్రజలు సెంటిమెంట్‌కు విలువనిస్తారు. అది చేజారకుండా చూసుకోవాల్సిన బాధ్యత సీఎం రేవంత్ రెడ్డికి, ఆయనతో పాటు అధికారం పంచుకున్న బృందానికి ఉంది. ఉద్యమకారులు, అమరుల కుటుంబాలు, పోరాటయోధులను ఆలంబనగా చేసుకుని వారి కార్యక్రమాలు సాగాలి. మేధావుల సూచనలు,సలహాలు తీసుకోవాలి. గృహజ్యోతి, సిలిండర్ పథకాలకు కూడా వీరినే హీరోలుగా తీసుకుని అమలు చేయాలి. అంతేగానీ ప్రియాంక రాకవల్ల మైలేజీ వస్తుందని అనుకుంటే పొరపాటే.

### ఢిల్లీ యాత్రలు మానుకోవాలి..

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుని వాటిని సత్వరంగా పరిష్కరించే క్రమంలో సొంతంగా నిర్ణయాలు ఉండాలి. అదేపనిగా ఢిల్లీకి యాత్రలను మానుకోవాలి. అవసరమైతే లోపాయకారిగా హాట్‌లైన్‌లో మాట్లాడుకోవాలి. అప్పుడే రేవంత్‌పై ప్రజల్లో నమ్మకం పెరుగుతుంది. కేసీఆర్ చేసిన తప్పులను చేయకుండా ముందుకు సాగాలి. అన్ని వర్గాలకు తాము అండగా ఉన్నామని చెప్పడం వేరు.. ఆచరించి చూపడం వేరు. రైతుబంధు, కాళేశ్వరం,గొర్రెల పథకంలో దుబారాను, అవినీతిని బయటపెట్టి నిలదీయగలిగితే ప్రజలు హర్షిస్తారు. అదేపనిగా విమర్శలతో కాలం గడిపితే కూడా ప్రజలు ఆదరించరు. ఈ జాగ్రత్తలు తీసుకుని ముందుకు సాగితేనే రేవంత్ రెడ్డి సమర్థమైన సీఎంగా రాణిస్తారు.

# వనంలోకి వనదేవతలు



**నేటితో ముగిసిన మేడారం జాతర**

**గద్దెల వద్ద పూజారుల ప్రత్యేక పూజలు**

**సమ్మక్క చిలకలగుట్టకు.. సారలమ్మ కన్నెపల్లి ఆలయానికి..**

**జాతరకు తరలివచ్చిన కోటిన్నర మంది భక్తులు**

**మేడారం జాతర సక్సెస్**

నేటి సాయంత్రం పూజారులు గద్దెల వద్ద పూజలు నిర్వహించారు. అనంతరం వన దేవతలను తిరిగి అడవికి తరలించారు. సమ్మక్కను చిలకలగుట్టకు, సారలమ్మను కన్నెపల్లి ఆలయానికి, పగిడిరాజును మహబూబ్‌బాద్ జల్లా పూనుగొండ్లకు, గోవిందరాజును ఏటూరునాగారం మండలం కొండాయ్ గ్రామానికి తరలించారు. దీంతో జాతరను ముగించినట్లయింది. చివరి రోజు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో మేడారం జాతరకు చేరుకున్నారు. వన ప్రవేశంతో జాతర ముగియనున్న నేపథ్యంలో మరో 20 లక్షల మంది భక్తులు నేడు దర్శించుకున్నట్లు తెలిపారు. అడవి బిడ్డల జాతరలో అన్నీ తానై నిర్వహించిన మంత్రి సీతక్క జాతర సక్సెస్ కు సహకరించిన ప్రతి ఒక్కరికీ పేరు పేరునా కృతజ్ఞతలు తెలిపారు. మేడారం జాతర ముగిసినప్పటికీ భక్తులు తిరుగు వారం వచ్చే బుధవారం వరకు మొక్కులు చెల్లించుకుంటారు. చివరి రోజైన శనివారం పలువురు రాజకీయ ప్రముఖులు వనదేవతలను దర్శించుకున్నారు.

### పోలీసుల భారీ బందోబస్తు

సమ్మక్క-సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెల వద్దె శుద్ధి చేసి ప్రత్యేక పూజలు నిర్వహించి రాత్రి ఏడు గంటల సమయంలో వనంలోకి తీసుకువెళ్లారు. ఈ క్రమంలో పోలీసులు భారీగా పొటెత్తిన జన ప్రవాహన్ని అదుపు చేస్తూ పూజారుల బందోబస్తు నిర్వహించారు. అమ్మలను వనంలోకి తీసుకెళ్లు క్రమంలో వర్షం పడటం ఆనవాయితీ. ఈ ఏడాది కూడా వర్షం పడటంతో అక్కడికి వచ్చిన భక్తులు, పూజారులు పులకించిపోయారు. సమ్మక్క, సారలమ్మలు తమను ఆశీర్వదించినట్లు భావించారు.

### జాతర సక్సెస్

మేడారం జాతర విజయవంతం కావడానికి సహకరించిన భక్తులు, అధికారులు, సిబ్బంది, మీడియాకు మంత్రులు ధనసరి అనసూయ సీతక్క, కొండా సురేఖ ధన్యవాదాలు తెలిపారు. జాతర విజయవంతం అవడంపై గవర్నర్లు, సీఎం సంతోషం వ్యక్తం చేశారని వెల్లడించారు. అడుగడుగునా సలహాలు ఇస్తూ మార్గదర్శనం చేసిన సీఎం రేవంత్ రెడ్డికి మంత్రి సీతక్క ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. 21 శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి జాతరను సక్సెస్ చేశారని ప్రశంసించారు. ముఖ్యంగా జాతరలో చివరి రోజు శనివారం వీకెండ్ రావడంతో రాత్రి భారీ సంఖ్యలో భక్తులు మేడారానికి బయలు దేరారు. దీంతో రాత్రి కొంతసేపు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు సకాలంలో స్పందించి పరిస్థితిని చక్కద్దారు. అంతేకాదు అమ్మల ఆశీస్సులు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాతర సక్సెస్ అవ్వడం సంతృప్తినిచ్చిందని మంత్రి సీతక్క చెప్పారు .

## బొడ్రాయి వార్షికోత్సవంలో ఎమ్మెల్యే పూజలు



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** పట్టణంలో బొడ్రాయి వార్షికోత్సవంలో భాగంగా బొడ్రాయి వద్ద నిర్వహించిన విఘ్నేశ్వర పూజ, గోపూజ, స్వస్తి వాచనం, స్థల శుద్ధి పూజ కార్యక్రమాల్లో పాల్గొని బొడ్రాయికి జలాభిషేకం చేసిన ఎమ్మెల్యే డా. భూక్య మురళినాయక్ ఉమా దంపతులు, మున్సిపల్ చైర్మన్, కమిటీ చైర్మన్ డా.పాల్వాయి రాంమోహన్ రెడ్డి, డా. సౌజన్య దంపతులు, డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి, కమిటీ సభ్యులు పర్కాల శ్రీనివాస్ రెడ్డి, ఘనపురపు ఆంజయ్య, మాలె నాగేశ్వర్ రావు , ఎడ్ల వేణుమాధవ్, ఎడ్ల రమేష్, పిల్లి సుధాకర్, ఆకుల హరిప్రసాద్ , బెల్లంకొండ శ్రీనివాస్ , జంగాల సదాశివుడు , పోతురాజు రాజు, అనుమాల వెంకటేశ్వర్లు , కర్పూరపు గోపి, ఆకుల నవీన్, తునగర్ ఈశ్వర్, గోన శ్యాం రావు, పూజారులు బొడ్డుపెల్లి ఉపేంద్రం, గంగుల శ్రీనివాస్, పట్టణ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌కు సన్మానం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ ఎమ్మెల్సీగా ఎన్నికైన సందర్భంగా వరంగల్ జిల్లా కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా హైదరాబాద్ లో కలిశారు. ఈ సందర్భంగా బల్మూరి వెంకట్ శాలువాతో సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఈవీ శ్రీనివాస్ రావు, ఎన్ ఎస్ యూఐ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పి.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా దుద్దిళ్ల శ్రీను బాబు జన్మదిన వేడుకలు



**వరంగల్ వాయిస్, మహదేవపూర్ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం శనివారం రాపల్లికోట గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దుద్దిళ్ల శ్రీను బాబు జన్మదిన సందర్భంగా శ్రీను బాబు చిత్ర పటానికి పంచామృతాభిషేఖం (తేనే, పాలు, నెయ్యి, నీరు, పెరుగు తో అభిషేకం) చేయడం జరిగింది. అనంతరం కేక్ కట్ చేసి, నిరుపేద కుటుంబాలకి దుస్తులు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు కాత్రేవుల నవీన్ యాదవ్, గ్రామ శాఖ అధ్యక్షులు కల్ల గట్టయ్య, కాంగ్రెస్ నాయకులు బొగ్గుల తిరుపతి, కాటవేని రాజయ్య, చంద్రయ్య, అట్టెం రాజు, ఐలయ్య, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

# పల్స్ పోలియోను విజయవంతం చేయాలి



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** పల్స్ పోలియో కార్యక్రమాన్ని సమన్వయంతో విజయవంతం చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో అధికారులను ఆదేశించారు. శనివారం సమీకృత జిల్లా అధికారుల భవన సముదాయం కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో మార్చి, 3న నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతానికి అదనపు కలెక్టర్ సంబంధిత శాఖ అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఐదు సంవత్సరాల లోపు 62071 మంది చిన్నారులు ఉన్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. మార్చి మూడో తేదీన పోలియో చుక్కలు వేసేందుకు చిన్నారులందరికీ పల్స్ పోలియో చుక్కల కార్యక్రమం చేపట్టినందున సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో విజయం సాధించాలన్నారు. ప్రధానంగా మురికివాడలు లక్ష్యంగా పెట్టుకోవాలని బస్టాండ్ రైల్వే స్టేషన్ వంటి ప్రధాన కేంద్రాలలో పోలియో చుక్కలు వేసేందుకు సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. పల్స్ పోలియో చుక్కల విశిష్టతపై విస్తృత ప్రచారం చేపట్టాలని గ్రామాలలో పట్టణాలలో ర్యాలీలు నిర్వహించాలని ఫ్లెక్సీల ద్వారా ప్రతి ఒక్కరికి తెలిసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మార్చి మూడో తేదీన ఉదయం 7 గంటల నుంచి పల్స్ పోలియో కార్యక్రమం మొదలవుతుందని సాయంత్రం 6 గంటల వరకు నిరంతరంగా కొనసాగుతుందన్నారు. అంతేగాక పోలియో చుక్కలు వేసేందుకు వైద్య సిబ్బంది మొబైల్ వాహనంలో పర్యటించ నున్నందున పల్స్ పోలియో చుక్కలు అందని చిన్నారుల తల్లితండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అందుబాటులో లేనివారు మార్చి 4 , 5 తేదీలలో ఇంటింటి సర్వే చేపట్టి చిన్నారులకు పోలియో చుక్కలు వేసేందుకు సిబ్బంది పర్యటించనున్నట్లు తెలియజేశారు. మార్చి ఒకటి నుంచి మూడవ తేదీ వరకు నిరంతర విద్యుత్ సరఫరా కు చర్యలు తీసుకోవాలన్నారు. మహిళా సంఘాలు స్వచ్ఛంద సంస్థలు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందే విధంగా సహకరించాలన్నారు. ఈ సమన్వయ సమావేశంలో జడ్పీ సీఈవో రమాదేవి, జిల్లా వైద్య శాఖ అధికారి అంబరీష, మున్సిపల్ కమిషనర్ రవీందర్, విద్యాశాఖ ఏసీఈ అధికారి శ్రీరాములు, డివిజనల్ పంచాయతీ అధికారి గంగా భవాని, విద్యుత్ శాఖ ఏడీఈ ఇందిర, పల్స్ పోలియో ఇమ్మ్యునైజేషన్ అధికారి డాక్టర్ విజయకుమార్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఎఫ్ఐ టాలెంట్ టెస్ట్ పోస్టర్ విడుదల



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని రాయపర్తి ప్రభుత్వ హైస్కూల్ లో ఈనెల 26 జరిగే పరకాల, నడికూడ మండలాల టెన్త్ టాలెంట్ టెస్ట్ ని విజయవంతం చేయాలని పోస్టల్ విడుదల చేశారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కళ్యాణ్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఎస్ఎఫ్ఐ టెన్త్ టాలెంటేషన్ నిర్వహిస్తుందని అందులో భాగంగానే ఈ సంవత్సరం కూడా మన పరకాల, నడికూడ మండలాలలో నిర్వహిస్తున్నామన్నారు. ఈ టెన్త్ టాలెంట్ టెస్ట్ విద్యార్థుల్లో బోర్డ్ ఎగ్జాం పట్ల ఉన్న భయాన్ని పోగొట్టడానికి అలాగే వారి సృజనాత్మకతను వెలికితీయడానికి ఉపయోగపడుతుందన్నారు. కాబట్టి విద్యార్థులందరూ నిరంతరం చదువుతూ పోరాడు చదువుకై పోరాడు నినాదంతో ముందుకు సాగుతున్న ఎస్ఎఫ్ఐ నిర్వహించే టెన్త్ టాలెంటేషన్ విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు బొచ్చు ఈశ్వర్, స్టాలిన్, విద్యార్థులు పాల్గొన్నారు.

## సీఎస్ఐ మిషన్ 'శతవత్సర సంబరాలు'



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణంలోని సీఎస్ఐ సెయింట్ పాల్స్ సంస్థ అధ్వర్యంలో సీఎస్ఐ మిషన్ "శతవత్సర సంబరాలు" (సీఎస్ఐ స్థాపించబడి 100 సంవత్సరాల కాలం పూర్తి అయిన సందర్భంగా) ఇటీవల నూతనంగా నిర్మించిన సీఎస్ఐ సెయింట్ పాల్స్ చర్చ్ ప్రారంభోత్సవం కార్యక్రమంలో బీఆర్ఎస్ పరకాల పట్టణ అధ్యక్షుడు డాక్టర్. మడికొండ శ్రీను, ఒకటో వార్డు కౌన్సిలర్ మడికొండ సంపత్ కుమార్ పాల్గొని, క్రైస్తవ సోదరులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రైస్తవ సోదరులు ఇలాంటి శత సంవత్సర సంబరాలను మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నడికూడ మండల అధ్యక్షుడు బొల్లారపు అనిల్ కుమార్, క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు.

# మహాదేవపూర్‌లో కోర్టులు ఏర్పాటు చేయాలి

### హైకోర్టు జడ్జీకి ఎంపీపీ రాణీబాయి విజ్ఞప్తి



**వరంగల్ వాయిస్, మహాదేవపూర్ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం మారుమూల అటవీ ఆదివాసీ ప్రాంతమైన పాత తాలూకా కేంద్రమైన మహాదేవపూర్ లో సబ్ కోర్టు, మునిసిఫ్ కోర్టు ఏర్పాటు చేయాలని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి ఎన్. రాజేశ్వర రావుకు ఎంపీపీ బి. రాణీబాయి రామారావు విజ్ఞప్తి చేశారు. శనివారం ఉదయం 9.30 గంటలకు మహాదేవపూర్ పాత ఎంపీడీఓ కార్యాలయంలో కోర్టు ఏర్పాటు కోసం హైకోర్టు న్యాయమూర్తి పరిశీలించారు. ఈ సంధ్భంగా ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చిన హైకోర్టు న్యాయమూర్తి రాజేశ్వర రావును ఎంపీపీ రాణీబాయి రామారావు కలిసి శాలువాతో సన్మానించారు. స్వాతంత్ర్యనికి పూర్వం నిజాం సర్కారు మహాదేవపూర్ లో కోర్టు, పోలీస్ స్టేషన్, నీటిపారుదల శాఖ కార్యాలయం, పట్టు పరిశ్రమ కార్యాలయం ఏర్పాటు చేసిందని తెలిపారు. మహాదేవపూర్ పంచాయతీ సమితి నుంచి కాటారం, మహా ముత్తరం, మలహర్, పలిమెల మండలాలు విడిపాయాయన్నారు. మహారాష్ట్ర, ఛత్తీస్ గఢ్ రాష్ట్రాల సరిహద్దుల్లోని ఆదివాసీ, గిరిజనులకు న్యాయ సేవలు అందించేందుకు మహాదేవపూర్ లో కోర్టులు ఏర్పాటు చేయాలని ఎంపీపీ విజ్ఞప్తి చేశారు. సబ్ కోర్టు, మునిసిఫ్ కోర్టుల ఏర్పాటు కోసం అవసరమైన భవనాలను ఏర్పాటు చేస్తామని హైకోర్టు న్యాయమూర్తికి విజ్ఞప్తి చేశారు. కోర్టు ఏర్పాటు కోసం పాత ఎంపీడీఓ కార్యాలయంతో పాటు మాడా కార్యాలయం, కలెక్టర్ క్యాంపు కార్యాలయం న్యాయశాఖకు కేటాయిస్తామని ఎంపీపీ బి.రాణీబాయి రామారావు హైకోర్టు న్యాయమూర్తికి విన్నవించారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి, ములుగు జిల్లా జడ్జీలు, జూనియర్ జడ్జీలు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, డీ ఎస్పీ, సీఐ, ఎస్ఐ, ఇంచార్జీ తహసీల్దార్, ఐకేపీ ఏపీఎం తదితరులు పాల్గొన్నారు.

# మైనార్టీలు రాజకీయంగా బలోపేతం కావాలి

## అంజతుల్లా ఖాన్



**వరంగల్ వాయిస్, మరిపెడ:** మైనార్టీలు రాజకీయంగా బలోపేతం కావాలని, అంతా కలిసి ఏకతాటిపై ఉంటూ తమ హక్కుల సాధనకు, దేశంలో తమ ఉనికిని కాపాడు కునేందుకు కృషి చేయాలని మజ్లిస్ బజావో తెహరిక్ పార్టీ (ఎంబీటీ) చీఫ్ జనాబ్ అంజతుల్లా ఖాన్ సూచించారు. శనివారం ఆయన ఖమ్మం జిల్లా కేంద్రంలోని ఓ కార్యక్రమానికి వెళ్తూ మార్గమధ్యంలో మరిపెడ మండల కేంద్రలోని మదర్సా ఏ ఇస్లామీయా రౌజతుల్ బనాత్ బాలికల మదర్సాను సందర్శించి మైనార్టీలను ఉద్దేశించి మాట్లాడారు. దేశంలో మైనార్టీల పట్ల ఏర్పడుతున్న పరిస్థితుల గురించి వివరించారు. అన్ని వర్గాల వారు అన్ని రంగాల్లో తమ తమ ఉనికిని చాటుతూ ముందుకు సాగుతున్నారని, కానీ ముస్లిం మైనార్టీలు కొన్ని రంగాలకే పరిమితమవుతున్నారన్నారు. వ్యవస్థలోని చట్టసభల్లో, ప్రాదేశిక సభల్లో, చిన్న, పెద్ద పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో మైనార్టీలు రాజకీయంగా బలోపేతం కావాలన్నారు. రాజ్యాధికారం ద్వారానే మైనార్టీల సమగ్ర అభ్యున్నతి సాధ్యపడుతుందన్నారు. అదే విధంగా నేటి సాంకేతిక యుగంలో మైనార్టీల పట్ల పెరుగుతున్న వివక్షనుంచి భద్రత కల్పించుకోవటానికి, తమ వర్గాన్ని కాపాడుకోవడానికి న్యాయ వ్యవస్థ, చట్ట వ్యవస్థపై పూర్తి అవగాహన అవసరమని, అందుకు అనుగుణంగా ప్రతి ఒక ఇంటి నుంచి న్యాయ శాఖ వైపు ఓ విద్యార్తి దృష్టి సారించాలన్నారు. స్వాతంత్ర ఉద్యమంలో, తెలంగాణ ఉద్యమ సమయంలో మైనార్టీలు ముందు వరుసలో ఉండి పోరాడారని, స్వాతంత్ర్య పోరాటంలో ఎందరో ముస్లింలు ప్రాణ త్యాగం చేశారని గుర్తు చేశారు. అదే విధంగా తెలంగాణ ఉద్యమ సమయంలో హైదరాబాద్ నుంచి కన్నా రూరల్ ప్రాంత మైనార్టీలు తెలంగాణ ఏర్పాటుకు పోరాడారని గుర్తు చేశారు. నేడు అదే ఉద్యమ స్పూర్తితో చట్టసభల్లో మైనార్టీలకు సముచిత న్యాయం లభించేవరకు పోరాటం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ యూత్ లీడర్ అఫ్ఫాన్ ఉల్లా ఖాన్, మదర్స ఏ ఇస్లామీయా రౌజతుల్ బనాత్ బాలికల మదర్సా ప్రిన్సిపల్ మౌలానా సాధిక్, వైస్ ప్రిన్సిపాల్ సాజిద్, హుస్సేమీ, ఉపాధ్యాయుడు మౌలానా అబ్దుల్ జబ్బార్, జామా మస్జీద్ యూత్ అధ్యక్షుడు షేక్ సబ్దార్, సయ్యద్ లతీఫ్, ఖాజా పాషా, అబ్దుల్ సత్తార్, మహబూబ్, రెగ్సిన్ మహమూద్, గౌస్, రహమాన్, బాషిత్ ఖాన్, జాకీర్, అఫ్సర్, తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా అమ్మ శ్రీను



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మండలంలోని చెరువుకొమ్ము తండా గ్రామానికి చెందిన దరావత్ అమ్మ శ్రీను( శ్రీనివాస్) బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా నియామకం అయ్యారు. ఈ మేరకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి ఆదేశాల మేరకు బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జే. కల్యాణ్ నాయక్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. అమ్మ శ్రీను ఇంతకుముందు ఏబీవీపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ గా, ఎస్టీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా, నిరుద్యోగ జేఏసీ సభ్యులుగా బాధ్యతలు నిర్వర్తించారు. ఈ సందర్భంగా ధరావత్ అమ్మ శ్రీను మాట్లాడుతూ బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా నియమించడానికి కృషి చేసిన రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి నాయకులకు పేరు పేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. కాగా రాష్ట్ర స్థాయి బీజేపీ ఎస్టీ మోర్చా కార్యదర్శిగా అమ్మ శ్రీను నియామకం కావడంతో చెరువుకొమ్ము తండా గ్రామస్తులు, యువకులు హర్షం వ్యక్తంచేశారు.

## అంతర్జాతీయ సదస్సుకు ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులు





**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఫిజిక్స్ విభాగంలో సహాయ ఆచార్యులుగా పనిచేస్తున్న డాక్టర్ జితేందర్, డాక్టర్ ప్రవీణ్ లు ఈనెల 25 నుంచి 28 వరకు మహారాష్ట్రలోని పూణే ప్రాంతంలో ( ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆఫ్ పౌడర్ మీటర్లజి , పెర్కులేట్ మెటీరియల్స్-2024) సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ సదస్కు కళాశాల ఫిజిక్స్ విభాగం ఇద్దరు అధ్యాపకులు పాల్గొంటున్నట్లు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బన్న ఐలయ్య తెలిపారు. వీరు ఈ సదస్సులో "ఐ ఎనర్జీ బల్మిల్డ్ మెటల్ నానో ప్రాక్టికల్ ఆఫ్కోబాలేట్ వై ఎక్స్ రే స్టడీ" అనే అంశంపై సంయుక్త పేపర్ ను ప్రజెంటేషన్ చేయనున్నట్లు ప్రిన్సిపల్ పేర్కొన్నారు. అంతర్జాతీయ సదస్సులో పాల్గొంటున్న ఇద్దరు అధ్యాపకులను కళాశాల అధ్యాపకులు, తదితరులు అభినందించారు.

## గిరిజన మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కొత్త సురేందర్



**వరంగల్ వాయిస్, ములుగు :** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జి కిషన్ రెడ్డి ఆదేశాల మేరకు గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జె. కళ్యాణ్ నాయక్ ఆధ్వర్యంలో గిరిజన మోర్చా రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. ఈ గిరిజన మోర్చా రాష్ట్ర కమిటీలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కొత్త సురేందర్ ను రాష్ట్ర కమిటీ నియమించడం పట్ల సంతోషంగా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆదివాసి సమాజానికి చెందిన కొత్త సురేందర్ కు గిరిజన మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రావడం చాలా సంతోషకరమని అన్నారు. కొత్త సురేందర్ మాట్లాడుతూ ప్రాథమిక విద్యాభ్యాసంలో ఆర్ఎస్ఎస్ భావజాలంతో ఎదిగి ఏబీవీపీ విద్యార్థి పరిషత్ లో పనిచేసి బీటెక్ లో విద్యార్థి పరిషత్ కాలేజీ ఇంచార్జిగా పనిచేసి ములుగు యువమోర్చా మండల అధ్యక్షుడిగా, బీజేపీ మండల అధికార ప్రతినిధిగా, నూతనంగా ఏర్పడిన ములుగు జిల్లా యువ మోర్చా అధ్యక్షుడిగా పనిచేసి బండి సంజయ్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నప్పుడు మొదటి ప్రజా సంగ్రామ పాదయాత్రలో పాల్గొని బండి సంజయ్ అన్నచేతుల మీదుగా ప్రజా సంగ్రామ యాత్ర బెస్ట్ అవార్డు పొందడం జరిగిందని తెలిపారు. ములుగు జిల్లాలో యువమోర్చా ఆధ్వర్యంలో రాష్ట్ర ఆదేశాల మేరకు ఎన్నో కార్యక్రమాలు చేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్యక్రమాలు చేపట్టి ములుగు బీజేపీ జిల్లాను ముందుకు తీసుక వెళ్లడంలో తనవంతు కృషి చేశారని అన్నారు. ఈ గిరిజన మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికకు కృషి చేసిన ములుగు జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా ప్రత్యక్షంగా పరోక్షంగా నాకు సహకారం చేసిన ప్రతి ఒక్కరికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలిపారు

## సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండలంలోని కొప్పుల గ్రామం నుంచి పరకాల వరకు నిర్మించబోయే రోడ్డు పనులను శనివారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎస్ టీఎస్ డీఎఫ్ నుంచి మంజూరైన రూ. 7 కోట్ల నిధులతో పనులు ప్రారంభించడం జరిగిందని తెలిపారు. వీలైనంత త్వరగా పని పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సేవలకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి, మాజీ జడ్పీటీసీ చల్లా చక్రపాణి, పరకాల మాజీ ఏఎంసీ చైర్మన్ పోలేపల్లి శ్రీనివాస్ రెడ్డి, ఏరుకొండ శంకర్, నిమ్మల రమేష్, రవి, రామ్ రెడ్డి, తిరుపతిరెడ్డి, భాస్కర్, బాసన్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధురాలి మెడలో బంగారం గొలుసు ఎత్తుకెళ్లిన దొంగ




**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఈ నెల 23న సాయంత్రం సుమారు 06 గంటల సమయంలో ఒక ఆగంతకుడు వృద్ధురాలి మెడలో నుంచి బంగారు గొలుసును ఎత్తుకెళ్లడం జరిగింది . వివరాల ప్రకారం భీమారానికి చెందిన గునిగంటి పద్మ అనే 50సంవత్సరాల ఒక మహిళ చింతగట్టు ఎస్ ఆర్ ఎస్ పీ కెనాల్ సమీపంలో కస్తూర్భా పాఠశాలలో వంట మనిషిగా పనిచేస్తుంది. ఈ నెల 23న సాయంత్రం సుమారు 06 గంటల సమయంలో కూడా ఆమె వంట చేసి ఇంటికి వస్తుండగా కెనాల్ వద్ద నుంచి సుమారు 100మీటర్ల దూరంలో సుమారు 25-30సంవత్సరాల వయసు కల్గిన ఒక వ్యక్తి నలుపు రంగు టీ -షర్ట్, నలుపు రంగు పాంటు ధరించి కళ్ళ జోడు పెట్టుకున్న ఒక ఆగంతకుడు వృద్ధురాలి వద్దకు వచ్చి టైమ్ ఎంత అని అడిగి ఆమె టైమ్ చెబుతుండగా ఆమె మెడ నుంచి సుమారు 3తులాల బంగారు గొలుసు 1,50,000/-రూపాయలు విలువ గల దానిని తీసుకుని పారిపోయాడు. ఈ విషయం తెలుసుకున్న కేయూసీ పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడి కోసం గాలిస్తున్నారు..

## ఎమ్మెల్సీ మహేష్ కుమార్‌ను కలిసిన శాసనసభ్యుడు నాగరాజు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఎమ్మెల్సీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ మేడారం శ్రీ సమ్మక్క-సారక్క తల్లుల దర్శనానికి వెళ్లి వెళ్తుండగా మార్గమధ్యలోని ఎన్ఎస్ఆర్ హొటల్‌లో వర్ధన్నపేట శాసనసభ్యుడు కేఆర్ నాగరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఆర్ గ్రూప్ ఇన్ స్టిట్యూషన్స్ అధినేత నాయినేని సంపత్ రావు, గడ్డం శివరాంప్రసాద్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## సమ్మక్క-సారక్కల దీవెనలు ప్రజలందరిపై ఉండాలి

### డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ



**వరంగల్ వాయిస్, ములుగు :** మేడారం సమ్మక్క సారక్కలను వరంగల్ ఎంపీ ఆస్పిరెంట్ డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ దర్శించకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని రేవంతన్న ముఖ్యమంత్రి కావాలన్న కోరికను రేవంతన్న జోడోయాత్ర మేడారం నుంచి మొదలు పెట్టిన రోజున మొక్కుకొని ఈ రోజు మొక్కు తీర్చడం జరిగింది. నేను రెసిడెన్షియల్ జాకారంలో విద్యను అభ్యసించే సమయంలో చాలాసార్లు సమ్మక్క సారక్కలను గట్టమ్మ తల్లిని దర్శించుకోవడం జరిగిందని గుర్తు చేసుకున్నారు. వారిని స్ఫూర్తిగా చేసుకోని కూడా కాంగ్రెస్ పార్టీ ద్వారా ఎంతో మంది ప్రజలకు, వృత్తిరీత్యా డాక్టర్ అయినందున వైద్య వృత్తిలో పేద ప్రజలకు సేవ చేస్తున్నాని తెలిపారు. ఇంకా సేవ చేయాలని తపనతో ఉన్నానని, కాంగ్రెస్ పార్టీ అవకాశమిస్తే ప్రజలందరి దీవెనలతో ముఖ్యమంత్రి ఆశీస్సులతో తప్పకుండా రాబోయే పార్లమెంటు ఎన్నికలలో ప్రజలందరి ఆశీస్సులతో పార్లమెంటులో అడుగుపెట్టే అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమం లో జిల్లా కాంగ్రెస్ నాయకులు వల్లలా జగన్ గౌడ్, కుమ్మరి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవితేజ, భీమదేవరపల్లి ఎస్సీ సెల్ అధ్యక్షుడు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## పలువురిని పరామర్శించి ఎంపీ మాలోత్ కవిత



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** ఇటీవల గుండెపోటుకు గురై చికిత్స పొందిన మహబూబాబాద్ మాజీ మార్కెట్ చైర్మన్ కత్తెరశాల విద్యాసాగర్,అనారోగ్యానికి గురై చికిత్స పోందుతున్న మున్సిపల్ చైర్మన్ వాంగుడోత్ వీరన్న, మైనార్టీ నాయకులు సలీం పాష, ఎస్టీ నాయకుల బోడ హరిలాల్ తల్లి మృతి చెందటంతో వారిని మానుకోట ఎంపీ మాలోత్ కవిత శనివారం పరామర్శించారు. డోర్నకల్ పట్టణంలోని కరెంట్ ఆఫీస్ సమీపంలోని ఆయన స్వగృహంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నున్న రమణ, కౌన్సిలర్ పోటు జనార్దన్, కో ఆప్షన్ సభ్యులు రాంభద్రం, జిల్లా మైనార్టీ నాయకులు పాషా, పట్టణ నాయకులు గౌస్, బికసాని రామకృష్ణ, మల్లం అనిల్, బీసీ సెల్ నాయకులు రాము చంటి, న్యాయవాది రమేష్, యశోధర్ జైన్ తదితరులు పరామర్శించారు.

## మృతుల కుటుంబాలకు పరామర్శ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన జంపాల వెంకటమ్మ భౌతిక దేహానికి వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పెరుమాండ్లగూడెం గ్రామంలో ఇటీవల మరణించిన పిడుగు చిన్న కొమ్మురమ్మ కుంటంబసభ్యులను పరామర్శించి తదనంతరం రాంనగర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త బర్ల రాజు కుమారడు బర్ల గోపాల్ ఈతకు వెళ్లి చెరువులో పడి మరణించగా వారి కుటుంబ కుటుంబ సభ్యులకు, అదే గ్రామానికి చెందిన మహమ్మద్ రషీద్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం కల్పించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎమ్మెల్యే నాగరాజు మనో ధైర్యం కలిగించారు. ఎమ్మెల్యే వెంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సమ్మెట మహేందర్ గౌడ్, గడ్డం శివరాం ప్రసాద్ తో పాటు ఐనవోలు మండలం, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు లిస్ట్ డ్రాఫ్ట్ పబ్లికేషన్ విడుదల

**వరంగల్ వాయిస్, వరంగల్ :** రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల గ్రాడ్యుయేట్ ఓటరు లిస్ట్ డ్రాఫ్ట్ పబ్లికేషన్ ను పొలిటికల్ పార్టీల సమక్షంలో జిల్లా కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్ లో శనివారం నాడు అదనపు కలెక్టర్ రెవెన్యూ జి.సుధారాణి, ఆర్డీవో కృష్ణవేణి విడుదల చేశారు. ఇందులో ఎలక్షన్ సూపర్ డెంట్ విశ్వ నారాయణ తో పాటు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎండీ నిహాల్ కాంగ్రెస్ పార్టీ, రజినీ కాంత్ వైఎస్ఆర్సీపీ, యం.మని బీఎస్పీ, లక్ష్మణ్ టీడీపీ, హరి శంకర్ బీజేపీ తరుపున పాల్గొన్నారు.

## విధుల్లో చేరిన షేక్ రిజ్వాన్ బాషా



**వరంగల్ వాయిస్, జనగామ :** జనగామ జిల్లా కలెక్టర్‌గా శనివారం షేక్ రిజ్వాన్ బాషా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ, ప్రజలకు సేవలు అందించడమే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సూచించారు. అనంతరం జిల్లా అధికారులతో ప్రధాన సమావేశ మందిరంలో శాఖల వారీగా సమీక్ష సమావేశం నిర్వహించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అంతక ముందు కలెక్టరేట్ లో అదనపు కలెక్టర్లు రోహిత్ సింగ్, పింకేశ్ కుమార్, లు ఆయనకు స్వాగతం పలికారు,

# ఘనంగా శ్రీను బాబు జన్మదిన వేడుకలు

### 51 కిలోల భారీ కేకుతో సంబరాలు



**వరంగల్ వాయిస్, కాటారం :** శ్రీపాద ట్రస్ట్ చైర్మన్ దుద్దిళ్ల శ్రీను బాబు జన్మదిన వేడుకలు శనివారం మండలం కేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రధాన కూడలితో పాటు వివిధ గ్రామాలలో శ్రీను బాబు జన్మదిన సందర్భంగా కేకులు కట్ చేసి పేద ప్రజలకు పంపిణీ చేశారు. 51 వ పుట్టినరోజును గుర్తుచేసేలా 51 కిలోల భారీ కేకును కట్ చేశారు. అనంతరం ఆంజనేయ స్వామి ఆవరణలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తండ్రి ఆశయ సాధనలో శ్రీధర్ బాబుకు వెన్నంటే ఉంటూ అనునిత్యం ప్రజల అందుబాటులో ఉండి ప్రజా సమస్యల పరిష్కరించడంలో ముందుంటారని పేర్కొన్నారు. శ్రీను బాబు జీవితంలో ఆయురారోగ్యాలతో వర్ధిల్లుతూ ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, ఎంపీపీ పంతకాని సమ్మయ్య, యూత్ కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు ఎర్రవేల్లి విలాస్ రావ్, మండల యూత్ అధ్యక్షుడు చీమల సందీప్, మహిళ మండల కాంగ్రెస్ అధ్యక్షురాలు, ఎంపీటీసీ జాడి మహేశ్వరి, కొట్టే ప్రభాకర్, సుందిల్ల ప్రభుదాస్, గంగిరెడ్డి లచ్చిరెడ్డి, రమేష్, మాచర్ల రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణం.. కమనీయం.. రమణీయం

### ఘనంగా లక్ష్మీ నరసింహ స్వామి కళ్యాణం

### నేరడ గ్రామంలో ఆధ్యాత్మిక శోభ



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లా కురవి మండలం నేరడ గ్రామంలో శ్రీ లక్ష్మి నర్సింహా స్వామి కళ్యాణం ..కమనీయంగా .రమణీయంగా జరిగింది. శనివారం గ్రామంలో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. గ్రామస్తులు ,ప్రజలు ,భక్తులు భారీ సంఖ్యలో చేరుకొని పూజలు నిర్వహించారు. శ్రీ లక్ష్మీనరసింహస్వామి కళ్యాణం పూర్వం నుంచి ప్రతి సంవత్సరం మాఘమాసం పౌర్ణమిన గ్రామ పెద్దలు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున అందరు కలిసి కళ్యాణం నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతుంది. ఈ కార్యక్రమానికి గ్రామంలోని కల్యాణంలో కూర్చునే వారి ఇంటి నుంచి డప్పు



చప్పుళ్లతో మంగళ, పూజా సామాగ్రి తీసుకెళ్తారు. అలానే ప్రతి సంవత్సరం మాఘమాసం రోజు శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణానికి పూలమాలల బాల్నే మృత్యుంజయ - దేవకమ్మ దంపతుల ఇంటి దగ్గర గ్రామ పెద్దలతో కలిసి తీసుకెళ్లడం జరుగుతుంది. ఈ అభిషేక కార్యక్రమాన్ని సుధాకర్ శాస్త్రి - కళావతి అర్చకుల దంపతులు పీటలపై కూర్చొని నూతన విగ్రహాలతో అంగరంగ వైభవంగా కళ్యాణం నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తుల పాల్గొన్నారు. ప్రతి సంవత్సరం దుకాణాలు ఏర్పాటు చేయడం జరుగుతుంది. ప్రధాన అర్చకులు సుధాకర చారి, తుమ్మనపల్లి మహేశ్వర చార్యులు, గ్రామ పెద్దలు మాజీ సర్పంచ్ శ్రీనివాస్ దంపతులు, నంగునూరి జగన్, బాల్నే సుమన్, తిపిరి శెట్టి ప్రసాద్ దంపతులు, కలకోట రమణ, భాస్కర్ దంపతులు, కొండబత్తుల మంగతాయ, కృష్ణ, తిపిరి శెట్టి ప్రసన్న కుమార్ దంపతులు భజన భక్తులు, రుద్రారపు యాలద్రి, రుద్రారాపు వెంకన్న, పాల రాములు, మొగిలిచర్ల రామచంద్రు, రాములు తదితరులు పాల్గొన్నారు.

## చార్టెడ్ అకౌంటెంట్స్ ఆఫీస్ ప్రారంభం

### హాజరైన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కాకతీయ యూనివర్సిటీ క్రాస్ రోడ్ వద్ద కందగట్ల గేట్ వే 3 ఫ్లోర్ లో నూతనంగా ఏర్పాటు చేసిన M/S.శృతి & కోచార్టెడ్ అకౌంటెంట్స్ ఆఫీస్‌ను వరంగల్ పశ్చిమ శాసన సభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ గ్రంథాలయసంస్థ చైర్మన్ మొహమ్మద్ అజీజ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్ తో రైతు మృతి



**వరంగల్ వాయిస్, కాటారం :** తన సాగుచేసిన పొలానికి నీరు అందించే క్రమంలో విద్యుత్ పనులు చేస్తుండగా కరెంట్ షాక్ తగిలి రైతు మృతి చెందిన సంఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం దామరకుంట గ్రామపంచాయతీలోని లక్ష్మిపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. శనివారం ఉదయం వ్యవసాయ పనుల కోసం వెళ్లిన సంతోషం బాపు (65) అనే రైతు ట్రాన్స్ ఫార్మర్ నుంచి మోటార్ కు విద్యుత్ తీగలు సాపుతున్న క్రమంలో విద్యుత్ షాక్ తగిలి బాబు అక్కడికక్కడే మృతి చెందారు. వ్యవసాయ పని కోసం వెళ్లిన ఇతర రైతులు చూసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కాటారం పోలీసులు కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం మహాదేవపూర్ సామాజిక ఆస్పత్రికి తరలించారు. మృతుడు బాపు ఇద్దరు కొడుకులు (మూగ వారు) కాగా కొద్ది రోజుల క్రితం ఒక కుమారుడు మృతి చెందారు.




# మేడారం మహా జాతర విజయవంతం





నాలుగు రోజుల్లో కోటి నలభై లక్షల మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు. అమ్మవార్ల వన ప్రవేశం జరుగనుంది. వనప్రవేశం పూర్తయినా భక్తుల రద్దీ కొనసాగుతుందని, ఆదివారం వరకు అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారు. 4వేల మంది పారిశుధ్య సిబ్బంది విధుల్లో పాల్గొన్నారు. తెలంగాణ గవర్నర్ తమిళిసై, సీఎం రేవంత్ రెడ్డి సమ్మక్క సారలమ్మను దర్శించుకుని నిలువెత్తు బంగారంతో మొక్కులు చెల్లించుకున్నారు. చివరి రోజు దాదాపు 20 లక్షల మంది భక్తులు అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకోనున్నారని భావిస్తున్నారు. అడవి బిడ్డల జాతరలో అన్నీ తానై నిర్వహించిన మంత్రి సీతక్క జాతర సక్సెస్‌కు సహకరించిన ప్రతి ఒక్కరికీ పేరు పేరునా కృతజ్ఞతలు తెలిపారు. చివరిరోజు సమ్మక్క, సారలమ్మలు వన ప్రవేశానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. సమ్మక్క, సారలమ్మ గద్దెలపై కొలువుదీరడంతో శుక్రవారం భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచే వెల్లువలా తరలివచ్చి, భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. గంటల తరబడి క్యూలో నిలబడి మరీ అమ్మవార్లను దర్శనం చేసుకున్నారు. పసుపు, కుంకుమ, ఒడిబియ్యం, నిలువెత్తు బంగారం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. **– వరంగల్ వాయిస్, మేడారం**







# కుర్రకారులో హీట్ పుట్టిస్తున్న అనుపమ..

స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డ  అనుపమ పరమేశ్వరన్  హీరోహీరోయిన్లుగా సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తోన్న చిత్రం 'టిల్లు స్క్వేర్' మల్లిక్‌రామ్ దర్శకుడు. శ్రీకర స్టూడియోస్ ఈ చిత్రాన్ని సమర్పిస్తోంది. ఈ సినిమా ఓటీటీ రైట్స్ రికార్డ్ ప్రైస్‌కు అమ్ముడయినట్లుగా తెలుస్తోంది. నెట్‌ఫ్లిక్స్ సంస్థ ఈ సినిమా ఓటీటీ హక్కులను రూ. 35 కోట్లకు సొంతం చేసుకున్నట్లుగా టాలీవుడ్ సర్కిల్స్‌లో వార్తలు వినిపిస్తున్నాయి. ఇది నిజమైతే మాత్రం ఈ మధ్యకాలంలో ఏ యంగ్ హీరోకి లేని రికార్డ్‌ను సిద్ధు జొన్నలగడ్డ క్రియేట్ చేసినట్లే. ఎలా అంటే, ఈ మధ్య కాలంలో ఏ కుర్ర హీరో చిత్రానికీ ఈ రేంజ్‌లో హక్కులు అమ్ముడవలేదు. 'డీజే టిల్లు' సక్సెస్ తర్వాత వస్తున్న ఈ సీక్వెల్‌పై మంచి అంచనాలు అయితే ఉన్నాయి కానీ.. ఈ రేంజ్‌లో ఓటీటీ హక్కులు అమ్ముడవుతాయని మాత్రం ఎవరూ ఊహించి ఉండరు. అందుకు కారణం మాత్రం అనుపమ అందాలే అని చెప్పుకోవాలి. ఇప్పటి వరకు పక్కింటి అమ్మాయిలా కనిపించిన అనుపమ.. ఈ సినిమా విషయంలో మాత్రం ఓ రేంజ్‌లో రెచ్చిపోయి కనిపిస్తోంది. ప్రేమికుల రోజున విడుదలైన ట్రైలర్‌లో ఆ విషయం స్పష్టంగా తెలిసిపోయింది. ట్రైలర్ తర్వాత ఈ సినిమా స్వరూపమే మారిపోయింది. అది ఇలా హక్కుల రూపంలో కనిపిస్తోంది. సిద్ధు జొన్నలగడ్డ కూడా తనదైన నటనతో మరోసారి సినిమాపై అంచనాలను పెంచేశారు. ట్రైలర్‌లో ఆయన చెప్పే ఒక్కో డైలాగ్.. కిర్రాక్ అన్నట్లుగా ఉంది. మొత్తంగా అయితే.. ఓటీటీ రైట్స్‌తో 'టిల్లు స్క్వేర్' మరోసారి వార్తలలో వైరల్ అవుతోంది. మార్చి 29న ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. మరి ట్రైలర్‌తో ఇంత హీట్ పుట్టించిన అనుపమ.. సినిమాలో ఇంకేం చేసి ఉంటుందో తెలియాలంటే మాత్రం.. మార్చి 29 వరకు వెయిట్ చేయక తప్పదు.

# ముగ్గురు భామల క్రూ


బాలీవుడ్ భామలు టబు, కరీనా కపూర్ ఖాన్, నేషనల్ అవార్డు విన్నర్ కృతిసనన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'క్రూ'. లూట్‌కేస్' ఫేమ్ రాజేష్ కృష్ణన్ దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమాను ఏక్తాకపూర్, రియాకపూర్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాను మార్చి 29న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. ఇదిలావుంటే తాజాగా ఈ మూవీ నుంచి ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ ముగ్గురు ఎయిర్ హోస్టెస్ గెటప్‌లో కనిపిస్తున్నారు. టబుతో ప్రమాదం అని, కరీనాను దొంగ అని, కృతి సనన్‌ను నకిలీ అని పోస్టర్స్‌కు క్యాప్షన్ ఇవ్వడం సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. ఎయిర్‌హోస్టెస్‌గా పనిచేస్తున్న ముగ్గురు మహిళల జీవితం ఆధారంగా రూపొందుతున్న చిత్రమిది. ఇక ఈ చిత్రంలో పంజాబీ యాక్టర్ దిల్జీజ్ దోసాంజ్, కపిల్ శర్మ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు.




# బికినీలో అదరగొట్టిన సమంత

టాలీవుడ్ అగ్ర హీరోయిన్ సమంత మరోసారి సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. తరుచూ తన రొటీన్ లైఫ్ ఫొటోలను అభిమానులతో పంచుకునే సమంత  తాజాగా విడుదల చేసిన ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో పెద్ద రచ్చనే లేపుతున్నాయి. ప్రస్తుతం మలేసియాలో ఓ గ్రాండ్ రిసార్ట్‌లో వేకేషన్ ఎంజాయ్ చేస్తున్న సమంత అక్కడ ఓ చిన్న పాండ్‌లో బికీనిలో స్విమ్ చేస్తూ దిగిన ఫొటోలను తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేయగా క్షణాల్లోనే తెగ వైరల్‌గా మారాయి. దీంతో చాలామంది హాలీడేస్ ఎంజాయ్ చేయండి అంటూ కామెంట్స్ పెడుతుండగా మరికొందరు సమంత ఏంటి విడాకుల తర్వాత రోజురోజుకు గ్లామర్ డోస్ పెంచుతుందంటూ నోరెళ్ల బెడుతున్నారు. ఇక ఆమె తాజాగా నటించిన బాలీవుడ్ వెబ్ సిరీస్ సిటాడెల్ త్వరలో విడుదల కానుంది.





## సరిపోదా శనివారం.. నాని ఫస్ట్ లుక్

నానిహీరోగా నటిస్తున్న చిత్రం 'సరిపోదా శనివారం' వివేక్ ఆత్రేయ దర్శకుడు. శనివారం నాని పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్రం ఫస్ట్ గ్లింప్స్‌ను విడుదల చేశారు. 'కోపాలు రకరకాలు. ఒక్కో మనిషిలో ఒక్కోలా ఉంటుంది. కానీ ఆ కోపాన్ని క్రమబద్ధంగా, ఓ పద్ధతిగా వారంలో ఒక్కరోజు మాత్రమే చూపించే పిచ్చి నా కొడుకుని చూశారా? నేను చూశా... పేరు సూర్య... రోజు శనివారం' అంటే హీరో పాత్రను ప్రతినాయక పాత్ర పోషిస్తున్న ఎస్.జె.సూర్య పరిచయం చేశారు. గ్లింప్స్‌లో హీరో ఇంట్రడక్షన్  ఇచ్చిన తీరు బావుంది. నాని మాస్ లుక్‌లో ఆకట్టుకుంటున్నారు. ప్రియాంక ఆరుళ్ మోహన కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి జేక్స్ బిజాయ్ సంగీతం అందిస్తున్నారు.




మేడారం
ముచ్చట్లు
జాతర వి(చిత్రాలు)

















# అబ్బురపరుస్తున్న ఆదివాసీల గిరిజన మ్యూజియం

## మేడారం భక్తులను ఆకట్టుకుంటున్న అడవి బిడ్డల జీవన శైలి

ఆదివాసీల జీవన విధానమే వేరుగా ఉంటుంది. ఆధునిక సమాజానికి దూరంగా అడవుల్లో, కొండల్లో జీవించే వీరంతా దాదాపుగా స్థానికంగా అడవుల్లో లభించే వాటితోనే తమకు కావాల్సిన వస్తువులు తయారు చేసుకుంటారు. ముఖ్యంగా వీరు వినియోగించే పనిముట్లు అన్ని అడవి నుంచి వచ్చినవే ఉంటాయి. మట్టిపాత్రల్లో వంట చేసుకోవడం, కర్ర బొంగుల్లో ఆహార పదార్థాలు నిల్వ ఉంచుకోవడం, గడ్డితో పేనిత తాళ్లనే వినియోగంచడం ఇలా చెప్పుకుంటే ఒకటా, రెండా వందల కొద్దీ వస్తువులు ఉంటాయి. కాలక్రమంలో వారి నుంచీ ఈ వస్తువులు మాయమవుతున్నాయి. కాలగర్భంలో కలిసిపోతున్న ఈ అరుదైన వస్తువులన్నీ సేకరించి తెలంగాణ ప్రభుత్వం మేడారం జాతరలో అద్భుతమైన మ్యూజియం ఏర్పాటు చేసింది. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులు ఈ అరుదైన వస్తువులను కన్ను ఆర్పకుండా చూస్తున్నారు.

### రెండు అంతస్తుల్లో మ్యూజియం నిర్మాణం

ఇక మ్యూజియంలోని మొదటి అంతస్తులో పూర్తిగా ఫోటో గ్యాలరీ కోసం ఏర్పాటు చేశారు. గిరిజనుల జీవన శైలికి సంబంధించిన గిరిజనులు వంట చేసుకోవడం, అడవికి వెళ్లడం, పశువులను తీసుకువెళ్లడం, వేట తదితర ఫోటోలు కనిపిస్తాయి. మరోవైపు మేడారం జాతరకు సంబంధించిన వన దేవతల ఫోటోలు గద్దెల వద్ద భక్తుల సందడి తోపాటు ఎడ్లబండ్లపై వచ్చే భక్తుల ఫోటోలు, శివశక్తుల పూనకాలు ఏర్పాటు చేశారు. 1980 కి ముందు ఫోటోలు సైతం కనిపిస్తాయి. అంతేకాకుండా ఈ మ్యూజియంలో గిరిజనుల జీవనశైలి మేడారం సమ్మక్క సారలమ్మలకు సంబంధించిన చరిత్ర ఆడియో, వీడియో రూపంలో వినిపించడానికి సైతం ఏర్పాటు చేశారు.























# జాతర లోటుపాట్లు ఉంటే స్వీకరిస్తాం

**రానున్న జాతరకు సరి చేసుకుంటాం**

**పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క**

**వరంగల్ వాయిస్, మేడారం :** జాతర నిర్వహణకు అత్యధిక నిధులు ఇచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రికి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కకు, మంత్రులకు రాష్ట్ర ప్రభుత్వానికి, దేవాదాయ మంత్రి కొండా సురేఖ, రవాణా శాఖ మంత్రిక పొన్నం ప్రభాకర్ కు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఇతర 20 శాఖల అధికారులు జాతర ఏర్పాట్లకు కష్టపడ్డారు. వార్తలను ఎప్పటికపుడు బయట ప్రపంచానికి చెరవేసిన మీడియాకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వరదల మూలంగా మేడారం రోడ్లు భవనాలు మునిగిపోయాయి. తక్కువ టైంలో వాటిని మరమ్మతులు చేసి భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశామన్నారు.

ఏషియా లోనే కాదు ప్రపంచం లోనే అతి పెద్ద జాతర మేడారం అని పేర్కొన్నారు. మధ్యాహ్నం వరకే కోటి 35 నుండి 45 లక్షల భక్తులు వచ్చినట్టు ప్రాథమిక అంచనా ఉందని తెలిపారు. రవాణా శాఖ 6000 బస్సులను నడిపింది . నిన్న సాయింత్రం వరకు 12 వేల ట్రిప్పులు నడిపారు. 10 నుంచి 12 కిమీ వైశాల్యం లో ఇంత మంది రావడం ఈ ప్రాంత బిడ్డగా గర్వకారణంగా భావిస్తున్నట్లు చెప్పారు. ఎండ తీవ్రత ఉన్నా రద్దీ తగ్గలే.. గంటలో వనప్రవేశం ఉన్న ఇంకా భక్తుల రద్దీ కొనసాగుతోందని తెలిపారు. మేడారం వచ్చిన భక్తులు అందరికీ తల్లుల దర్శనం అయ్యేంతవరకు యంత్రాంగం పనిచేస్తుందని స్పష్టం చేశారు. 5090 మంది పిల్లలు తప్పి పోయారు. ఇప్పటికే 5062 పిల్లలను వారి కుటుంబానికి అప్పజెప్పాము. మిగిలన పిల్లలు సురక్షితంగా ఉన్నారు. వారి కుటుంబసభ్యులు జంపన్న వాగు దగ్గర ఉన్న మిస్సింగ్ పాయింట్ దగ్గరకు రావాలని సూచించారు. ఇద్దరు భక్తులు ప్రమాద వశాత్తూ చనిపోవడం జరిగిందన్నారు. గతంతో పోలిస్తే ఈ జాతర చాలా మెరుగ్గా జరిగిందని పేర్కొన్నారు. బస్సుల సంఖ్య పెంచడం వల్ల బస్సులు కొన్ని సాంకేతిక లోపంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. కచ్చితంగా అందరి సూచనలు, సలహాలు పాటిస్తామని తెలిపారు. అవసరమైతే శాశ్వత ప్రాతిపదికన క్యూలైన్ల లో టాయిలెట్లు, మంచి నీరు ఏర్పాటు చేస్తామని చెప్పారు. జాతర లోటుపాట్లు ఉంటే స్వీకరిస్తామని, రానున్న జాతరకు సరి చేసుకుంటామని మంత్రి సీతక్క తెలిపారు.

# వనదేవతలను దర్శించుకున్న స్పీకర్ గడ్డం ప్రసాద్

**సమ్మక్క తల్లి ఎంతో మహిమ గల దేవత**

**25 ఏళ్లుగా జాతరకు వస్తున్నా.., తల్లి ఆశీర్వాదంతో సంతానం**





**వరంగల్ వాయిస్, మేగారం :** మేడారం శ్రీ సమ్మక్క-సారలమ్మలను శనివారం తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ దర్శించుకున్నారు. మంత్రి సీతక్క గడ్డం ప్రసాద్ కుమార్‌కు స్వాగతం పలికి దగ్గరుండి వనదేవతల దర్శనం చేయించింది. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు చేశారు. తన నిలువెత్తు బంగారం (బెల్లం)తో తులాభారం వేసి అమ్మవార్లకు సమర్పించారు. అనంతరం అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ సంతానం లేకపోవడంతో సమ్మక్క తల్లికి మొక్కుకున్నానని, ఆ తల్లి ఆశీర్వాదంతో నాకు సంతానం కలిగిందని చెప్పారు. సమ్మక్క తల్లి అంటే ఎంతో మహిమ కలిగిన దేవతని పేర్కొన్నారు. 25 ఏండ్లుగా అమ్మవారిని దర్శించుకుంటున్నానని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం జాతరకు మంచి ఏర్పాట్లు చేశారని కొనియాడారు. గతంలో ఇలాంటి ఏర్పాట్లు చేయలేదని భక్తులు చెబుతున్నారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఆకాంక్షించారు.

# మేడారం జాతరలో విద్యుత్ ఉద్యోగస్తుల అవిశ్రాంత కృషి భేష్

**సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి**



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ ఆధ్వర్యంలో మేడారం జాతరకు ఆహర్నిశలు శ్రమిస్తూ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా , అంతరాయాలు లేకుండా విద్యుత్ సరఫరా అందించినందుకు సీఎండీ శ్రీ కర్నాటి వరుణ్ రెడ్డి అధికారులను , ఉద్యోగస్తులను , సిబ్బందిని అభినందించారు. ఎప్పటికప్పుడు, ఎక్కడికక్కడ లోడ్ పర్యవేక్షణ చేస్తూ నిరంతర వెలుగులు అందించామని తెలిపారు. రెండు సబ్ స్టేషన్ల ద్వారా విద్యుత్ సరఫరా అందించామని, ఏ చిన్న అంతరాయం కలిగినా మరొక సబ్ స్టేషన్ నుంచి అందించేటట్లు ఏర్పాటు చేశామని తెలిపారు. భక్తుల రాక గణనీయంగా పెరుగుతుండటంతో జాతర విస్తీర్ణం పెరుగుతుందని అంచనాను దృష్టిలో పెట్టుకొని లోడ్ పరంగా ఇబ్బందులు తలెత్తకుండా మేడారం కొత్తూరు సబ్ స్టేషన్ లో రెండు 8 ఏంవీఏ, సమ్మక్క సబ్ స్టేషన్ లో రెండు 5 ఏంవీఏ కెపాసిటీ గల పవర్ ట్రాన్స్ ఫార్మర్లు ఏర్పాటు చేశామని తెలిపారు. 315 కేవీఏ సామర్థ్యం గల ట్రాన్స్ ఫార్మర్లు 4 , 160 కేవీఏ సామర్థ్యం గల ట్రాన్స్ ఫార్మర్లు 84 , 100 కేవీఏ సామర్థ్యం గల ట్రాన్స్ ఫార్మర్లు 96 , 25 కేవీఏ సామర్థ్యం గల ట్రాన్స్ ఫార్మర్లు 24 , 66 కిలో మీటర్ల మేరకు 11కేవీ, ఎల్ టీ లైన్లు విస్తరించామని తెలిపారు. కొంత మంది భక్తులకు అవగాహన లేక విద్యుత్ కొరకు 11 కేవీ లైన్ల మీద కొండీలు వేయడం వలన ట్రిప్ అవుతుందని , విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ఇలా ట్రిప్ అవుతుందని, దీని వలన సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది. కానీ, ఎటువంటి ప్రాణ నష్టం ఉండదని అన్నారు . వెంటనే మా సిబ్బంది అప్రమత్తం అయ్యి కేవలం 2 నుండి 3 నిమిషాల్లోనే యుద్ధప్రతిపాదికన సరఫరాను పునరుద్దరించారని తెలిపారు. ఈ సారి జాతరలో కొన్ని అదనపు పనులు కూడా చేపట్టడం జరిగిందని తాడ్వాయి వద్ద , గట్టమ్మ వద్ద పార్కింగ్ స్థలాల్లో కూడా అవసర మేరకు విద్యుత్ సరఫరా కూడా ఏర్పాటు చేశామన్నారు. నోడల్ ఆఫీసర్లుగా ఇద్దరు సీజీఎంలు , నలుగురు సూపెరింటెండింగ్ ఇంజినీర్లు, 10 మంది డివిజినల్ ఇంజినీర్లు , 120 మంది అసిస్టెంట్ డివిజినల్ ఇంజినీర్లు, అసిస్టెంట్ ఇంజినీర్లు, సబ్ ఇంజినీర్లు, 425 మంది ఆపరేషన్ అండ్ మెయింటనెన్స్ సిబ్బంది రేయింబవళ్లు విధుల్లోనే ఉంటూ విద్యుత్ సరఫరాను పర్యవేక్షించారు. వారికి కేటాయించిన ప్రాంతాల్లో నిరంతరం పెట్రోలింగ్ చేస్తూ ఉన్నారని, కాంట్రాక్ సిబ్బంది కూడా ఉన్నారని తెలిపారు . విద్యుత్ ప్రమాదాలు జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని, ట్రాన్స్ఫార్మర్ల చుట్టూ ఫెన్సింగ్ కూడా ఏర్పాటు చేశామన్నారు . మేడారంలోని సమ్మక్క , సారలమ్మ దీవెనలతో , విద్యుత్ ఆధికారులందరూ సమిష్టి కృషి తో జాతర మొత్తంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిరంతర వెలుగులు అందించామన్నారు .



# తిరుగు ప్రయాణమైన భక్తులు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఆసియాలోనే అతిపెద్ద జాతరగా పేరు గాంచిన మేడారం సమ్మక్క సారలమ్మ జాతర కు దేశం నలుమూలల నుంచి భక్తులు పోటెత్తి వచ్చారు. నాలుగు రోజులుగా మేడారం పరిసర ప్రాంతాలు అమ్మవార్ల దర్శనానికి వచ్చిన భక్తులతో కిట కిట లాడాయి.. అయితే నేడు సమ్మక్క, సారలమ్మ అమ్మవార్లు వనప్రవేశం జరుగుతున్న నేపథ్యంలో అమ్మవార్లను దర్శించుకున్నారు భక్తులు తిరిగి వారి వారి స్వగ్రామాలకు తరలి వెళ్తున్నారు. భక్తుల తిరుగు ప్రయాణం సందర్భంగా ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలోని క్యూ లైన్లు నిండిపోయాయి. ఇప్పటి వరకు దాదాపు పది వేల ట్రిప్పుల బస్సులు నడిపినట్లు అధికారులు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన గుడారాలు, టెంట్లు కాళీగా దర్శనమిస్తున్నాయి. తమ సామగ్రినీ, పిల్లలను చేతిలో పట్టుకొని తిరుగు ప్రయాణం సాగిస్తున్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com